జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
మంగళవారం
18-08-2026
సంపుటి 1 సంచిక 266
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195




## వేములవాడ రాజన్న ఆలయంలో విజిలెన్స్ ఆకస్మిక తనిఖీలు

4లో

### విద్యా, వైద్య రంగాలకు

# అత్యంత ప్రాధాన్యం

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




**టిమ్స్ ఆస్పత్రులతో పేదలకు మెరుగైన వైద్యం..**

**2027 డిసెంబర్ నాటికి నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులన్నీ ప్రారంభం**

**దశ, హైదరాబాద్:** తెలంగాణ ప్రజా పాలనలో విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యా వ్యవస్థలో మార్పులు అవసరమని పేర్కొన్నారు. హైదరాబాద్ సనత్‌నగర్‌లో నిర్మించిన అత్యాధునిక డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని సీఎం ప్రారంభించారు. అనంతరం మంత్రులతో కలిసి ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. కార్డియో, రీనల్, ఆర్గన్ ట్రాన్స్‌ప్లాంట్ సైన్సెస్ విభాగాల్లో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, పోస్ట్ ఆపరేటివ్ వార్డు, ట్రామా విభాగం, ఐసీయూలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. చికిత్స కోసం వచ్చే రోగుల నమోదు ప్రక్రియ, రిసెప్షన్‌లో టోకెన్ డిస్పెన్సర్ యంత్రం, ఓపీ కౌంటర్ పనితీరును సీఎం పరిశీలించారు. వివిధ విభాగాల వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో మాట్లాడి వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. అత్యాధునిక వైద్య పరికరాల పనితీరును పరిశీలించి, ఆస్పత్రి నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. పేదల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతని, ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గత 32 నెలల్లో

..మిగతా 4వ పేజీలో →



## 22ఏ భూములపై పొంగులేటి కీలక ఆదేశాలు

**దశ, హైదరాబాద్:** 22ఏ నిషేధిత భూముల జాబితాలో ప్రైవేటు భూములు చేరుతున్న అంశంపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. 22ఏను అడ్డుపెట్టుకుని ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని స్పష్టం చేశారు. దరఖాస్తులను జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు.22ఏ జాబితాలో భూమి ఉందనే కారణంతోనే దరఖాస్తును తిరస్కరించవద్దని మంత్రి సూచించారు. అసలు ఆ భూమి నిషేధిత జాబితాలోకి ఎలా వచ్చిందో పరిశీలించాలని చెప్పారు. సంబంధిత రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిజమైన భూ హక్కుదారులకు న్యాయం చేస్తూనే ప్రభుత్వ భూములను కాపాడాలని సూచించారు. నిషేధిత భూముల అంశంపై రాష్ట్ర

..మిగతా 4వ పేజీలో →

### అందుబాటులోకి

# టీజీ సేఫ్

**ఆహారం, ఔషధాల నాణ్యతపై ఇక మరింత నిఘా**

**ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ విభాగాల విలీనం**



**దశ, హైదరాబాద్:** తెలంగాణలో ఆహారం, ఔషధా ల నాణ్యతను పర్యవేక్షించడంతో పాటు కల్తీని అరికట్టేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వేర్వేరుగా పనిచేసిన ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ విభాగాలను విలీనం చేసి ఏకీకృత పాలనా వ్యవస్థను ఏర్పాటు చేసింది. కొత్త సంస్థకు 'టీజీ సేఫ్' (తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ గా నామకరణం చేసింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

### కమిషనర్‌గా అవినాశ్ మహంతి

'టీజీ సేఫ్' నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతిని ప్రభుత్వం నియమించింది. ఆయన గతంలో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఆహార వ్యాపార కార్యకలాపాలు విస్తరిస్తున్న నేపథ్యంలో నాణ్యత లేని, నకిలీ ఆహార పదార్థాలు, ఔషధాల తయారీ, విక్రయాలను అడ్డుకుని ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం పేర్కొంది.

### ఒకే గొడుగు కింద ఆరు విభాగాలు

కొత్త ఏకీకృత వ్యవస్థ కింద డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, ఫుడ్ సేఫ్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ ,లీగల్ అండ్ ప్రాసిక్యూషన్,లేబొరేటరీ, అడ్మినిస్ట్రేటివ్ విభాగాలు పనిచేయనున్నాయి. ఆహార భద్రత, ఔషధ నియంత్రణ చట్టాల ప్రకారం సంబంధిత అధికారులకు ఉన్న చట్టబద్ధమైన అధికారాలు యథాతథంగా కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్

..మిగతా 4వ పేజీలో →



## వచ్చే వారం నుంచి వరుసగా నోటిఫికేషన్లు

**దశ, హైదరాబాద్:** తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తూ వచ్చే వారం నుంచి వివిధ శాఖల్లోని ఖాళీల భర్తీకి వరుసగా నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. మరోవైపు ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ రెండు కీలక ప్రకటనలతో ఉద్యోగార్థుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టీజీపీఎస్సీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఛైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడారు. నియామక ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. చిన్న పొరపాటు జరిగినా వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని, అందుకే ప్రతి దశలోనూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రశ్నాపత్రాల రూపకల్పన నుంచి మూల్యాంకనం వరకు అన్ని ప్రక్రియల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పొరపాట్లకు తావులేని వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వివరించారు.ఇదే

..మిగతా 4వ పేజీలో →

## మంత్రి సీతక్క చొరవతో పెరిగిన రిటైర్మెంట్ బెనిఫిట్స్

**దశ, హైదరాబాద్:** అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు తెలంగాణ ప్రభుత్వం పెంచిన సర్వీస్ ఎండ్ బెనిఫిట్స్‌ను అందిస్తోంది. 65 ఏళ్ల వయస్సులో పదవీ విరమణ చేసిన వారితో పాటు, 60 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారు స్వచ్ఛందంగా విధుల నుంచి వైదొలిగినా ఈ ప్రయోజనాలు వర్తించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో ఈ నిర్ణయం అమల్లోకి వచ్చింది.

2023లో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం అంగన్‌వాడీ టీచర్లకు రూ.1 లక్ష, అంగన్‌వాడీ హెల్పర్లు, మినీ అంగన్‌వాడీ వర్కర్లకు రూ.50 వేలుగా ఉన్న సర్వీస్ ఎండ్ బెనిఫిట్స్‌ను 2025 మే 30న ప్రభుత్వం పెంచింది. తాజా ఉత్తర్వుల ప్రకారం 65 ఏళ్ల వయస్సులో పదవీ విరమణ చేసే అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.1 లక్ష చొప్పున అందిస్తున్నారు. అదే విధంగా 60 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు స్వచ్ఛందంగా విధుల నుంచి వైదొలిగినా ఇదే ప్రయోజనాలను పొందే అవకాశం కల్పించారు. వాలంటరీ డిస్‌ఎంగేజ్‌మెంట్



బెనిఫిట్ కింద అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.1 లక్ష చొప్పున అందజేస్తున్నారు.

### ఇప్పటివరకు 15.61 కోట్ల చెల్లింపు

2026-27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు మొత్తం 2,572 మంది అంగన్‌వాడీ సిబ్బంది ఖాతాలకు రూ.15.61 కోట్ల సర్వీస్ ఎండ్ బెనిఫిట్స్

..మిగతా 4వ పేజీలో →




## తెలంగాణలో SIR ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

**దశ, హైదరాబాద్**: తెలంగాణలో రాష్ట్ర ఎన్నికల సంఘం SIR ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. SIR ప్రక్రియలో తొలి దశ పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు అందినట్లు వెల్లడించారు. ఎన్యూమరేషన్ ప్రక్రియలో 2.73 శాతం మంది ఓటర్లు మరణించినవారిగా గుర్తించినట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మరోవైపు సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. అలాగే 32 లక్షల మంది ఓటర్లు మ్యాపింగ్ చేసుకోలేదని గుర్తించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో

..మిగతా 4వ పేజీలో →

## పార్టీకి అన్యాయం చేసేవారిని బయటకు పంపుతాం: చిన్నారెడ్డి



**దశ, హైదరాబాద్:** కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ఎన్నికల్లో తనకు టికెట్ రాకపోవడానికి డబ్బు కారణమని ఆరోపించారు. వనపర్తిని సర్వనాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను అన్నీ భరిస్తూ పార్టీలో కొనసాగుతున్నానని చెప్పారు. లేదంటే మరో జీవన్‌రెడ్డిలా పార్టీకి దూరమయ్యేవాడినని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో కొన్ని తప్పులు జరుగుతున్నాయని అన్నారు. పార్టీకి అన్యాయం చేస్తున్న వారిని బయటకు పంపిస్తామని స్పష్టం చేశారు.45 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ నిర్మాణం కోసం తాను ఎంతో కష్టపడ్డానని చిన్నారెడ్డి చెప్పారు. పార్టీ జెండాను ఎప్పుడూ మోయని వారికి టికెట్లు ఇచ్చారని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్‌లో ఉండి తర్వాత బీఆర్‌ఎస్‌లో

..మిగతా 4వ పేజీలో →



## నీళ్ల కోసం ఎస్సై కాళ్లు పట్టుకున్న రైతు

**దశ, ఖమ్మం:** వైరా రిజర్వాయర్ నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఇరిగేషన్ ఆఫీస్ ముందు రైతులు నిరసన చేపట్టారు. రిజర్వాయర్‌లో 17 అడుగుల నీరు ఉన్నప్పటికీ ప్రభుత్వం నీటిని విడుదల చేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసనను అడ్డుకోవడానికి వచ్చిన ఎస్సై కాళ్లపై ఒక రైతు పడి, పంటలను కాపాడేందుకు నీటిని విడుదల చేయించాలని వేడుకోవడం అక్కడ ఉన్నవారిని తీవ్రంగా చలించివేసింది.

## 30 శాతం కమీషన్ లేనిదే రెవెన్యూ శాఖలో ఫైల్ కదలదు


### హరీశ్

దశ, హైదరాబాద్: 22ఏ నిషేధిత భూముల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తీవ్ర గందరగోళానికి గురిచేస్తోందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. గతంలో క్లియర్ అయిన భూములను కూడా మళ్లీ 22ఏ జాబితాలో చేర్చారని విమర్శించారు. హైదరాబాద్‌లో లక్షలాది ప్రాపర్టీలను ప్రొహిబిషన్ లిస్టులో చేర్చారని, 20-30 ఏళ్ల క్రితం కొనుగోలు

..మిగతా 4వ పేజీలో →

### 30 శాతం కమీషన్ లేనిదే రెవెన్యూ శాఖలో

## ఫైల్ కదలదు



**మొదటి పేజీ తరువాయి**

చేసిన ఇళ్లు, అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల విషయంలోనూ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రిజిస్ట్రేషన్ కోసం చలాన్లు చెల్లించిన తర్వాత భూమి 22ఏలో ఉందంటూ రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ శాఖలో ఏ పని కావాలన్నా 30 శాతం కమీషన్ ఇవ్వాల్సిందేనని, కమీషన్ లేకుండా ఒక్క ఫైల్ కూడా కదలడం లేదని హరీశ్ రావు ఆరోపించారు. 22ఏ భూముల వ్యవహారంపై తక్షణమే విచారణ జరిపి, డిసెంబర్ 7, 2023 నుంచి ప్రొహిబిషన్ లిస్టులో చేర్చిన భూముల వివరాలపై ప్రభుత్వం వైట్ పేపర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## అందుబాటులోకి టీజీ సేఫ్

**మొదటి పేజీ తరువాయి**

యాక్ట్-2006, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్-1940 కింద నిబంధనల అమలు, పర్యవేక్షణను బలోపేతం చేయడమే విలీనం ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం తెలిపింది.

### ఆధునిక నియంత్రణ వ్యవస్థపై దృష్టి

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నియంత్రణ వ్యవస్థను ఆధునికీకరించేందుకు రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుత యంత్రాంగాన్ని సమీక్షించడంతో పాటు సర్వీస్ రూల్స్ సమన్వయం, క్షేత్రస్థాయి యూనిట్ల బలోపేతం, ప్రయోగశాలల మౌలిక వసతుల మెరుగుదల వంటి అంశాలను కమిటీ అధ్యయనం చేయనుంది. జాతీయ, అంతర్జాతీయ ఉత్తమ విధానాలను పరిశీలించి తెలంగాణకు మరింత పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను రూపొందించేందుకు ఈ కమిటీ సిఫారసులు చేయనుంది. ఆహారం, ఔషధాల నాణ్యతపై సమన్వయంతో నిఘా పెంచడం ద్వారా ప్రజలకు మరింత భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొంది.

### 22ఏ భూములపై

## పొంగులేటి కీలక ఆదేశాలు

**మొదటి పేజీ తరువాయి**

సచివాలయంలో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సబ్ రిజిస్ట్రార్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులు, ఫిర్యాదులపై అధికారులను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యలపై ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసేందుకు త్వరలో టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. 22ఏ భూముల విషయంలో నిబంధనల పేరుతో ప్రజలకు అనవసర ఇబ్బందులు కలిగించకుండా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు.

### వచ్చే వారం నుంచి వరుసగా

## నోటిఫికేషన్లు

**మొదటి పేజీ తరువాయి**

సమయంలో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. ఇటీవల మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను గుర్తించి, ప్రతీ ఆరు నెలలకు ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించేలా పటిష్టమైన విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. ఉద్యోగాల భర్తీ బాధ్యత ప్రభుత్వానిదేనని, నిరుద్యోగ యువత ఎలాంటి వదంతులను నమ్మకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. టీజీపీఎస్సీ, ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ స్పష్టమైన హామీలతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో ఉత్సాహం నెలకొంది.

## మంత్రి సీతక్క చొరవతో పెరిగిన రిటైర్మెంట్ బెనిఫిట్స్

**మొదటి పేజీ తరువాయి**

చెల్లించారు. ఇందులో 473 మంది అంగన్‌వాడీ టీచర్లకు రూ.4.73 కోట్లు, 1,930 మంది అంగన్‌వాడీ హెల్పర్లకు రూ.9.65 కోట్లు అందించారు. పెంచిన బెనిఫిట్స్ ప్రకారం మరో 14 మంది అంగన్‌వాడీ టీచర్లకు రూ.28 లక్షలు, 59 మంది అంగన్‌వాడీ హెల్పర్లకు రూ.59 లక్షలు చెల్లించారు. గతంలో అమల్లో ఉన్న ఉత్తర్వుల ప్రకారం మరో 96 మంది అంగన్‌వాడీ సిబ్బందికి రూ.36.10 లక్షలు అందించారు. గత ప్రభుత్వ హయాంలో పదవీ విరమణ చేసిన అంగన్‌వాడీ సిబ్బందికి కూడా ప్రస్తుత ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించింది. పదవీ విరమణ అనంతరం అంగన్‌వాడీ సిబ్బందికి ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, దీర్ఘకాలంగా సేవలందించిన వారికి గౌరవప్రదమైన ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపింది.

## పార్టీకి అన్యాయం చేసేవారిని బయటకు పంపుతాం: చిన్నారెడ్డి

**మొదటి పేజీ తరువాయి**

చేరినవారు.. అక్కడ సంపాదించుకుని తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చారని అన్నారు. అలాంటి వారికి మళ్లీ టికెట్లు ఇవ్వడం సరికాదని అభిప్రాయపడ్డారు. 'ఇదా కాంగ్రెస్ పార్టీ? ఇదా రాజకీయం?' అంటూ ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా ఉండి ఉంటే వనపర్తికి మహర్దశ వచ్చేదని చిన్నారెడ్డి అన్నారు. తనకు అవకాశం ఇచ్చి ఉంటే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేవాడినని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధిస్తున్నాయని తెలిపారు. అయితే కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని చిన్నారెడ్డి స్పష్టం చేశారు. పార్టీలోనే ఉంటూ తప్పులను ప్రశ్నిస్తానని చెప్పారు. కాంగ్రెస్‌కు అన్యాయం చేసే వారిని బయటకు పంపిస్తామని హెచ్చరించారు

### కస్తూర్బా పాఠశాలలో ఫుడ్ పాయిజన్

## 18 మంది విద్యార్థులకు అస్వస్థత

**దశ, సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా మద్దూరులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రాత్రి భోజనం వికటించి 18 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, కడుపునొప్పితో ఇబ్బంది పడుతున్న విద్యార్థినులను పాఠశాల సిబ్బంది చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

# రాజన్న ఆలయంలో విజిలెన్స్ ఆకస్మిక తనిఖీలు



**దశ, వేములవాడ:** వేములవాడ రాజన్న ఆలయంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇద్దరు సీఐలు, ఒక తహసీల్దార్‌తో పాటు మొత్తం పది మంది అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి సుమారు ఆరు గంటలుగా విస్తృతంగా సోదాలు నిర్వహిస్తున్నారు. ఆరోపణలు వచ్చిన విభాగాలపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. విచారణ కార్యాలయం, గదుల నిర్వహణ, లీజులు, అన్నదానం, గోదాం, లడ్డూ ప్రసాదం, పీఆర్‌వో కార్యాలయం తదితర విభాగాల్లో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. లోతైన విచారణ కోసం పలు కీలక రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఒక్కసారిగా విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టడంతో ఆలయ అధికారులు ఉలిక్కిపడ్డారు. రాత్రి వరకు సోదాలు కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఏదైనా విభాగంలో తనిఖీలు పూర్తికాకపోతే మంగళవారం కూడా కొనసాగించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. తనిఖీలు పూర్తయిన అనంతరం అధికారులు వెల్లడించే వివరాలపై ఆసక్తి నెలకొంది.

### నాగపంచమి వేళ పాముల

# రక్షణకు ప్రత్యేక చర్యలు



**దశ, హైదరాబాద్:** నాగపంచమి సందర్భంగా పాములను పట్టుకుని హింసించే వారిపై అటవీశాఖ నిఘా ముమ్మరం చేసింది. పాములపై ఉన్న అపోహలను తొలగించడంతో పాటు వాటి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక చర్యలు చేపట్టింది. అటవీ దళాల అధిపతి వినయ్‌కుమార్ ఉన్నతాధికారులతో సమావేశమై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని ఆదేశించారు. యాంటీ పోచింగ్ స్క్వాడ్లు, స్థానిక అటవీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సంయుక్త బృందాలను ఏర్పాటు చేసి ప్రధాన ఆలయాలు, మార్కెట్లు, రవాణా కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. పాములాడించే వారి వద్ద ఉన్న నాగుపాములు, ఇతర జాతుల పాములను గుర్తించి రక్షిస్తున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో మొత్తం 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీకి చెందిన సుమారు 25 మంది సభ్యులు అటవీశాఖ సిబ్బందితో కలిసి తనిఖీల్లో పాల్గొంటున్నారు. ఇప్పటివరకు 17 నాగుపాములను రక్షించినట్లు అధికారులు తెలిపారు.

### పాలు పోయడం ప్రమాదకరం

నాగపంచమి సందర్భంగా ప్రముఖ ఆలయాల వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాములు పాలను జీర్ణించుకోలేవని, వాటికి పాలు తాగించడం వల్ల తీవ్ర అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని భక్తులకు వివరిస్తున్నారు. జీవ పాములను పూజించే బదులు పాము ప్రతిమలకు పూజలు చేయాలని సూచిస్తున్నారు. పాములు వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద రక్షిత జీవులని, వాటిని పట్టుకోవడం, అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరమని అటవీశాఖ స్పష్టం చేసింది. రక్షించిన పాములకు అవసరమైన చికిత్స అందించి, ఆరోగ్యంగా ఉన్న వాటిని సురక్షితమైన అటవీ ప్రాంతాల్లోకి తిరిగి వదిలివేస్తామని అధికారులు తెలిపారు. పాములాడించే వారి వద్ద జీవ పాములు ఉన్నట్లు గుర్తించినా లేదా వాటిని అక్రమంగా పట్టుకున్నా వెంటనే అటవీశాఖకు సమాచారం అందించాలని ప్రజలను అధికారులు కోరారు.

# నకిలీ పెరుగు గుట్టు రట్టు



**దశ, మేడ్చల్ మల్కాజిగిరి:** కుషాయిగూడ పోలీసు స్టేషన్ పరిధిలోని వైష్ణవి ఎన్క్లేవ్‌లో నందిని మిల్క్ సెంటర్లో అక్రమంగా కల్తీ పెరుగు, కల్తీ కోవా తయారీ సెంటర్ పై మల్కాజిగిరి ఎస్.ఓ.టీ పోలీసులు దాడి చేశారు. సుమారు 120 కిలోల కల్తీ పెరుగు, 6 కిలోల కోవాను తరలిస్తున్న రామచందర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్.ఓ.టీ ఎస్సై సాయికుమార్ మాట్లాడుతూ కల్తీ పాలకోవా, కల్తీ పెరుగును తయారు చేస్తూ మ్యానుఫ్యాక్చర్ డేటు, ఎక్స్పైరీ డేటుతో పాటు, ఎలాంటి లేబల్ వేయకుండా చాలా కాలంగా అక్రమంగా విక్రయిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం మేరకు నందిని మిల్క్ సెంటర్ పై మల్కాజ్గిరి ఎస్‌ఓటి ఎస్సై సాయికుమార్, ఎస్వోటీ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం మెరుపు దాడులు చేశామని తెలిపారు. కల్తీ వస్తువులను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని, టాటా ఏసీ వాహనాలను సీజ్ చేశారు ఎస్‌ఓటి పోలీసులు. నందిని మిల్క్ పార్లర్ ఓనర్ రామచందర్ ను అదుపులోకి తీసుకున్నారు. పెరుగు, కోవా శాంపిల్ లను ఫుడ్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ కు పంపించి పూర్తి ఆధారాలు వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు నందిని మిల్క్ పార్లర్ లో తనిఖీలు నిర్వహించగా దాదాపు 1000 కిలోల పెరుగు, 50 కిలోల కోవా నిలువ ఉంచినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ వారికి హానిచేసే కల్తీ ఆహార పదార్థాలు, నకిలీ వస్తువులు ఎవరైనా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి ఎస్వోటీ ఎస్సై సాయికుమార్ హెచ్చరించారు.

### గిరిజన విద్యాసంస్థల్లో పార్ట్ టైట్ ఉద్యోగులకు

# దరఖాస్తులకు ఆహ్వానం



**దశ, హైదరాబాద్;** " నల్గొండ, సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పార్ట్ టైమ్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని రీజినల్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ రాయి ప్రకటనలో తెలిపారు. నల్గొండ జిల్లాలో డిగ్రీ లెక్చరర్లు, జూనియర్ లెక్చరర్లు, పీజీటీ, టీజీటీ విభాగాల్లో మొత్తం 19 పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 22 సాయంత్రం 5 గంటల వరకు నల్గొండలోని మహిళా సమాఖ్య భవన్లో ఉన్న ప్రాంతీయ సమన్వయాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి 24న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాలుర గురుకుల పాఠశాల, అవంతిపురంలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు. డిగ్రీ లెక్చరర్లు, జూనియర్ లెక్చరర్లు, పీజీటీ, టీజీటీ విభాగాల్లో మొత్తం 27 పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ లెక్చరర్లు 2 పోస్టులు, జూనియర్ లెక్చరర్లు 11 పోస్టులు, పీజీటీ 5 పోస్టులు, టీజీటీ 7 పోస్టులు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ 2 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పీజీటీ, టీజీటీ అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 50 శాతం, బీఈడీలో 50 శాతం, టెట్ పార్ట్ 2లో అర్హత ఉండాలని పేర్కొన్నారు. జేఎల్ అభ్యర్థులకు పీజీ లేదా డిగ్రీలో 55 శాతం మార్కులతో పాటు బీఈడీలో 55 శాతం, టెట్ 2లో అర్హత ఉండాలని తెలిపారు. డిగ్రీ లెక్చరర్లకు పీజీ లేదా డిగ్రీలో 55 శాతం, పీహెచ్డీ లేదా నెట్ లేదా సెట్ అర్హత ఉండాలని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లాలో 1:5 నిష్పత్తిలో ఎంపిక చేసి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, సమాచారం కోసం 83339 25379 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు



### విద్యా, వైద్య రంగాలకు

# అత్యంత ప్రాధాన్యం

**మొదటి పేజీ తరువాయి**

ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల సామర్థ్యాన్ని పెంచి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. టిమ్స్ ఆస్పత్రులు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని సీఎం పేర్కొన్నారు. గత పాలకులు టిమ్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినా పనులను ముందుకు తీసుకెళ్లలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో మూడు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాన్ని వేగవంతం చేశామని, వరంగల్‌లోనూ ఆస్పత్రి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. 2027 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని సీఎం వెల్లడించారు. ప్రతి ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. అవసరమైన నిధులు కేటాయించడంతో పాటు నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా ప్రత్యేక అధికారులతో పర్యవేక్షణ చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



### తెలంగాణలో SIR ముసాయిదా

# ఓటర్ల జాబితా విడుదల

**మొదటి పేజీ తరువాయి**

సుమారు 92 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాలను సమర్పించి తమ వివరాలను నిర్ధారించుకోవాలని సూచించారు. నోటీసులు ఎందుకు జారీ చేశామనే విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తామని పేర్కొన్నారు. ఓటు తొలగింపుపై అభ్యంతరాలు ఉన్నవారు తమ అభ్యంతరాలను సమర్పించవచ్చని తెలిపారు.

### ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు

ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాలు, సంబంధిత దరఖాస్తులను పరిశీలించనున్నట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. SIR ప్రక్రియను పూర్తి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మందికి పైగా అధికారులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు గడువులోగా స్పందించి తమ వివరాలు, అర్హతకు సంబంధించిన పత్రాలను సమర్పించాలని అధికారులు సూచించారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com